# రజకులందరూ ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం

**- గుత్తిలో జరిగిన**
**- 'రజక ఆకాంక్ష' సభలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళ మాధవి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ పిలుపు**

**గుత్తి (గుంతకల్లు), జూలై 12 (నేటి దర్శిని)**
రజకులందరూ ఐకమత్యంగా ఉంటేనే అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధ్యమవుతుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళ మాధవి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు దువ్వాడపు రామారావు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ తదితరులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం గుంతకల్లు నియోజకవర్గం, గుత్తి పట్టణంలోని విరూపాక్షి రెడ్డి ఫంక్షన్ హాలులో రజక ఆకాంక్ష సభ నిర్వహించారు. రజకులు ఆర్థికంగా బలోపేతం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వారు అభిప్రాయపడ్డారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రజక సంక్షేమ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ సావిత్రి అధ్యక్షతన భారీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రజకులు ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ల్యాండ్రీలు నిర్వహిస్తున్న రజకులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ సౌకర్యం



గుత్తిలో రజక ఆకాంక్ష సభలో ప్రసంగిస్తున్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళ మాధవి

కల్పించాలని, 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలని, రజక కార్పొరేషన్ కు 1000 కోట్ల రూపాయలు కేటాయించాలని, జీవో నెంబర్ 27 ప్రకారం ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ధోబి పోస్టు భర్తీ చేయాలని, తెలంగాణ తరహాలో ఆధునిక ధోబి ఘాటు నిర్మించాలని, రజకులను బీసీఏ నుండి ఎస్సీ క్యాటగిరీకి మార్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రజకులకు ,వారి అభ్యున్నతికి, చేయూత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ కె.సి హరి, రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రజక అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి కమ్మన్న, జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి నాగప్ప, దానికి మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కల చెరువు ప్రతాప్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, పట్టణ టిడిపి అధ్యక్షులు ఎంకే చౌదరి, స్థానిక నాయకులు కిరణ్, తిప్పదు శీన, మల్లికార్జున, నాగేంద్ర, చెర్లపల్లి సురేష్, సూరి, భూషణ్, నారాయణస్వామి, సుంకన్న, జయరాం, లక్ష్మీనారాయణ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా రైతులందరూ బీమా ప్రీమియం చెల్లించండి..!



**గుత్తి (గుంతకల్లు),జూలై 12 (నేటి దర్శిని)**
ఖరీఫ్ సీజన్ 2026-27 కు సంబంధించి ప్రతి రైతు నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని గుంతకల్లు నియోజకవర్గం, గుత్తి మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా తెలిపారు. ఎకరాకు ప్రీమియం పంటల వారీగా.. వేరుశనగ రూ.640, పత్తి రూ.1140,అరటి రూ.3000, కంది రూ.80,,జొన్న రూ.84, మొక్కజొన్న రూ.132,ఆముదం రూ.80 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు తమ పంట వివరాలను స్వీయ ధ్రువీకరణ పత్రం ద్వారా ధ్రువపరిచి తమ ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకాన్ని తీసుకొని కామన్ సర్వీస్ సెంటర్ లో పంట బీమా కోసం దరఖాస్తు చేసుకుని దానికి తగిన ప్రీమియం చెల్లించాలని సూచించారు. వేరుశనగ, పత్తి,అరటి పంటలకు ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 15వ తేదీ చివరి గడువు కాగా, కంది,జొన్న, మొక్కజొన్న,ఆముదం పంటలకు ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 31 తేదీగా నిర్ణయించారని ఏఓ చెప్పారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు




**గుంతకల్లు, జూలై 12 (నేటి దర్శిని)**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని కోరుతూ ఆదివారం గుంతకల్లు పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ గుంతకల్లు నియోజకవర్గం సమన్వయకర్త వాసగిరి మణికంఠ ఆదేశాల మేరకు వారు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ అనంతపురం పార్లమెంట్ సీనియర్ సభ్యురాలు బండి చంద్రకళ, రాయల్ రంగ, గాజుల రాఘవేంద్ర, కథల వీధి అంజి తదితరులు పాల్గొన్నారు.

# గుంతకల్లులో నిత్యం జరుగుతున్న చోరీలకు అడ్డుకట్ట వేసేవారే లేరా..?

**-విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్**

**గుంతకల్లు, జూలై 12 (నేటి దర్శిని)**
గుంతకల్లులో నిత్యం జరుగుతున్న చోరీలకు అడ్డుకట్ట వేసే వారే లేరా..? అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన గుంతకల్లులోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలసి మాట్లాడారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ నిత్యం చోరీలు జరుగుతున్నాయన్నారు. అలాగే ఏటీఎంలో డబ్బులు కూడా చోరీ కి గురవుతున్నాయన్నారు. ప్రముఖ దేవాలయాల్లోని హుండీ సొమ్ముకు భద్రత లేకుండా పోతోంది. ఇక ప్రజల ఆస్తులు, బైకులు, వ్యవసాయ భూముల్లోని ట్రాన్స్ఫార్మర్లు తదితర వస్తువులన్నీ దొంగలించబడుతున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన బాధ్యత పోలీసులు, ప్రభుత్వానిదే అని అన్నారు. సీసీ కెమెరాలు ఉన్న ఏటీఎం సెంటర్లు, తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగలు చోరీలకు పాల్పడుతున్నారన్నారు. దేవాలయాల్లోని హుండీలను



సైతం కొల్లగొడుతున్నారన్నారు ఈ దేవాలయాలకు ట్రస్టు సభ్యులుగా కూటమి పార్టీ నాయకులు కొనసాగుతున్నారన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ బలహీన పడిందని.. ఈ విషయాన్ని గుర్తించిన అంతరాష్ట్ర దొంగలు చోరీలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న సుమారు 13 మంది ఐపీఎస్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేయలేదన్నారు. పోలీసు సిబ్బంది కొరత ఉన్న కారణంగా విఐపి పర్యటన సందర్భంగా భద్రత నిమిత్తం పంపుతుండడంతో రాత్రి వేళల్లో పెట్రోలింగ్ సక్రమంగా లేక చోరీలు పెరిగిపోయాయన్నారు. దీంతో ప్రజల, దేవాలయాల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ స్టేషన్ ఉండగా ఒక్కొక్క పోలీస్ స్టేషన్లో 45 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సిన చోట 10,15 మంది మాత్రమే ఉంటున్నారన్నారు. మూడు స్టేషన్లకు కలిపి ఒక సీఐ మాత్రమే ఉన్నారని ఎస్ఐలు కూడా అతి తక్కువ సంఖ్యలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలకు కూటం ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. హిందూ మనోభావాలను అడ్డుపెట్టుకొని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. తక్షణమే పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. రాష్ట్రంలో పెట్టరేగుతున్న చోరీలను అరికట్టడంలోనూ,శాంతి భద్రతల పరిరక్షణలోనూ పోలీసు శాఖ కీలకమన్నారు. మీడియా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్ర స్వామి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దేవేంద్ర, చిదంబరం తదితరులు పాల్గొన్నారు.

# వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారిన రామన్నపాలెం గ్రామం వెళ్లే రహదారి



**కాకినాడ జూలై 12 (నేటి దర్శిని)**
కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పటవల గ్రామ పంచాయతీ రామన్నపాలెం గ్రామం వెళ్లే రహదారి అధ్వానంగా తయారై,వాహన చోదకులకు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. ప్రధాన రహదారి నుండి రామన్నపాలెం గ్రామం వెళ్లే రహదారి సుమారు కిలోమీటరు దూరం ఉంటుంది. కిలోమీటరు మేర రహదారి రాళ్లు పైకి లేచి,గుంతలు పడి వాహనాల రాకపోకలకు అసౌకర్యకరంగా మారింది. గోతులుగా మారిన ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుండడంతో తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. పాదచారులు సైతం ఈ రహదారిపై నడవాలంటే భయాందోళనకు గురవుతున్నారు. రహదారి కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా,పట్టించుకునే వారు కరువయ్యారు. రామన్నపాలెం గ్రామానికి చెందిన ప్రజలు ఒకే రహదారి కావడంతో అనునిత్యం ఈ రహదారినే ఉపయోగిస్తుంటారు.ప్రతిరోజు ద్విచక్ర వాహనాలు,ఆటోలు,కార్లు తిరుగుతూ ఉంటాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో అసౌకర్యాలకు గురవుతూనే రహదారిపై రాకపోకలు సాగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తమ గ్రామ రహదారిని మెరుగుపరిచి సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేలా చూడాలని ప్రజల ముక్తకంఠంతో కోరుతున్నారు.

# కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలి

**-ప్రజా సమస్యలు, అభివృద్ధిపైనే రాజకీయ చర్చలు జరగాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పిలుపు**

**ఉరవకొండ రూరల్, జూలై 12 (నేటి దర్శిని)**
: సమాజంలో కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలకు అన్ని రాజకీయ పార్టీలు దూరంగా ఉండాలని జనసేన పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్ కుమార్ అన్నారు. ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై ప్రతిపక్షం నిర్మాణాత్మకంగా ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజమని, అయితే ప్రతి అంశాన్నీ కుల, మత కోణంలో చూపించి సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేసిన



కొందరిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సమర్థిస్తున్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో చోటుచేసుకున్న పలు ఘటనలను కుల, మత కోణంలో చూపిస్తూ రాజకీయ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. హిందూ దేవతలు, జాతీయ నాయకులు, దేశ సార్వభౌమత్వంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సందర్భాల్లో కూడా అలాంటి వ్యాఖ్యలను సమర్థించే విధంగా స్పందించడం సమాజంలో ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. విచారణలో ఉన్న ఘటనలను కూడా కులపరమైన కోణంలో చూపిస్తూ ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం సమాజంలో విభేదాలను పెంచుతుందని అన్నారు. చట్టం తన పని తాను చేసుకునేలా అవకాశం కల్పించాలని, నేరాలకు పాల్పడిన వ్యక్తులకు కులం, మతం ఆధారంగా మద్దతు ఇవ్వడం సరైన రాజకీయ విధానం కాదని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ పరిపాలనకు అన్ని పార్టీలు కట్టుబడి ఉండాలని సూచించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుల, మత విభజనలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. రాజకీయ పార్టీలు ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధానాలను విడిచిపెట్టి ప్రజా సమస్యలు, అభివృద్ధి, పరిపాలన అంశాలపైనే దృష్టి సారించాలని గౌతమ్ కుమార్ పిలుపునిచ్చారు.

# ఇస్లాంపూర్ లో (సర్) ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ వేగవంతం.




**తూప్రాన్, జూలై 12 (నేటి దర్శిని)**
మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలో తూప్రాన్ మండల బిజెపి అధ్యక్షులు పిట్ల పోచయ్య నేతృత్వంలో (సర్) ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరు తమ ఓటు ప్రక్రియను క్రమంగా పొందు పరచుకోవాలని సూచించారు. ఇందులో డబుల్ ఓట్లుగా ఉన్న వాటిని, నూతన యువకుల ఓట్లను చేర్చుటకు, పేరులో తప్పు ఉన్న వాటిని సరి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గొల్లపల్లి సంతోష్ రెడ్డి, మండల సెక్రెటరీ అంబటి మహేష్ యాదవ్, బూతు అధ్యక్షుడు జోడు నవీన్, నర ప్రశాంత్, దుండిగళ్ళ మధు, జోడు సందీప్, మన్నె స్వామి, బైండ్ల బిక్షపతి, నర్రా శివకుమార్ తదితరులు ఉన్నారు.

# భద్రకాళి దేవాలయంలో శాకాంబరి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

**ఉమ్మడి వరంగల్ జూలై 12 (నేటి దర్శిని)**
వరంగల్ నగరంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళి దేవాలయంలో ఈనెల 15 నుంచి 29 తేదీ వరకు నిర్వహించనున్న శాకాంబరి నవరాత్రి మహోత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. ఈ



సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలించే అవకాశం ఉన్న నేపథ్యంలో దర్శనం, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం ,క్యూలైన్లు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

